సాక్షి
జగిత్యాల

బుధవారం । 1 । నవంబర్ । 2023



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. సుమారు 10వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. చాలారోజుల తరువాత ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఏర్పాట్లను ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, సునీల్, ఇన్స్‌పెక్టర్లు సంపత్ పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

దేశభద్రతకు పోరాడిన వ్యక్తి పటేల్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

జగిత్యాల: దేశభద్రత కోసం పోరాటం చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం వల్లబాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు పునరంకితం అవుదామని పేర్కొన్నారు. 'సర్దార్ వల్లబాయ్‌పటేల్ దర్శనికత చర్యల వల్ల లభ్యమైన దేశ అంతర్గత భద్రతను పటిష్ఠ పర్చేందుకు తోడ్పాటు అందిస్తాం' అని ప్రతిజ్ఞ చేశారు. అదనపు కలెక్టర్ లత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జగిత్యాల: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైందని స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువత స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, సీ విజిల్‌యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబరు గుర్తించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. యువతకు దేశభవిష్యత్‌ను మార్చే సత్తా ఉందని, యువత ఎలాంటి ప్రలోభాలకూ గురికాకుండా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ, స్వీప్ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనానికి సీసీ కెమెరా



సీసీ కెమెరా ఏర్పాటు చేసిన వాహనంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

జగిత్యాలరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోభాగంగా వాహనాల తనిఖీ సమయంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం చేసే ప్రతి తనిఖీని, సంఘటననూ తెలుసుకునేలా వారు వినియోగించే వాహనానికి సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. దానిని ఎన్నికల సంఘం కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఈ విధానం ద్వారా ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం చేసే ప్రతి పనినీ ఎన్నికల సంఘం పరిశీలించే అవకాశం ఉంది.

రూ.10.38లక్షలు పట్టివేత



రాయపట్నం వద్ద నగదు పట్టుకున్న పోలీసులు

ధర్మపురి: ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.10,38,300 పట్టుబడినట్లు సీఐ రమణామూర్తి తెలిపారు. మండలంలోని రాయపట్నం చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా భారీ మొత్తంలో నగదు కనిపించిందని, సరైన పేపర్లు లేని కారణంగా సీజ్ చేసి ఎస్‌డీఎం అప్పజెప్పామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ధర్మపురి, గొల్లపల్లి ఎస్సైలు దత్తాత్రి, నరేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు



హద్దులు పెడుతున్న సర్వేయర్

జగిత్యాలరూరల్: ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఈనెల 3 నుంచి పదో తేదీ వరకు స్వీకరించనున్న విషయం తెల్సిందే. ఈ క్రమంలో జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు ఎవరూ లోనికి రాకుండా హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం రెవెన్యూ సర్వేయర్లు వచ్చి రంగులతో హద్దులు గీయించారు.

హద్దు మీరితే అంతే..!



'ఓ వ్యక్తి పోలింగ్ రోజు ఉదయం 8.30 గంటల లోపు ఓటు వేసి.. సిరా గుర్తు చూపించిన మొదటి 50 మందికి 250 ఎంఎల్ కూల్‌డ్రింక్ బహుమతిగా ఇస్తామని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది కాస్త వైరల్ అయింది. సరదాగా పెట్టిన ఆ పోస్ట్ ఇబ్బందికరంగా మారింది. అధికారులు గుర్తించి సదరు వ్యక్తికి నోటీసు జారీ చేశారు..'

- సోషల్ మీడియాపై నిరంతర పర్యవేక్షణ
- జిల్లాలో ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- సీ విజిల్ యాప్ వినియోగించుకోండి
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియాదే హవా నడుస్తోంది. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలుగానీ, వ్యక్తిగత ప్రతిష్ఠకు గానీ భంగం కలిగేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ తదితర మాధ్యమాల్లో ఎన్నికలకు సంబంధించిన పోస్టులు వస్తున్నాయి. ఒక్కోసారి వదంతులు సృష్టించి క్షణాల్లో వైరల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటిపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు అధికారులు. సోషల్ మీడియాలో ఎక్కడ జరిగిన సంఘటనయినా వీడియో తీసి క్షణాల్లో వైరల్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగానీ, నాయకులనుగానీ కించపరిచేలా ఉన్నా, ఇబ్బందికరంగా ఉన్నా ఆధారాలతో నిరూపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. జిల్లాలో సోషల్ మీడియా నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వీరు నిత్యం సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తుంటారు. ఏదైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు గానీ, రాజకీయాలకు సంబంధించిన వార్తలుగానీ ఉంటే వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా ఐటీసెల్, సైబర్ క్రైమ్ పోలీసుల సహకారం ఉంటుంది. ముందుగా ఎవరైతే పోస్ట్ చేశారో వారికి నోటీసులు జారీ చేస్తుంటారు. అయినప్పటికీ సదరు ఖాతాదారుడు వినకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ప్రత్యేక కమిటీ అధికారి పేర్కొన్నారు. గ్రూప్ అడ్మిన్స్‌పై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాట్సప్‌ల్లోనే అత్యధికం..

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్), యూట్యూబ్‌లకన్నా వాట్సప్‌నే వాడుతున్నారు. కొందరు రాజకీయ పార్టీల నాయకులకు అనుకూలమైన కార్యకర్తల ద్వారా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు సైతం వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల నిబంధనల ప్రకారం ఇలాంటి ఉంటే కమిటీ పరిశీలించి తగిన చర్యలు తీసుకోనుంది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

- ఎన్నికలపై జిల్లాలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని, ఓటర్లను ప్రలోభాలను గురిచేయడం, ఇతర ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. ఇలాంటి సమయంలో సీ విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్‌ను మంగళవారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అభ్యర్థులు ఖర్చుల వివరాలను ప్రత్యేక బ్యాంక్ ఖాతాను ప్రారంభించి తెలియజేయాల్సి ఉంటుందని, ప్రతి ఖర్చును రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఖర్చులను షాడో టీమ్‌లు గుర్తిస్తాయని వెల్లడించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, సోషల్‌మీడియా స్క్రోలింగ్, యాడ్స్‌కు అనుమతి తప్పనిసరిగా పేర్కొన్నారు. 13 అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించామని, 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లను ప్రత్యేక కమిటీలు గుర్తిస్తాయని వివరించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లలోపు గుంపులుగా ఉండకుండా క్యూలైన్లలో ఓటర్లు ఉండాలన్నారు. అదనపు కలెక్టర్లు లత, దివాకర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని ఎన్నికల సెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పార్టీల ప్రతినిధులు



అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు.. పెట్టిన టోపీ చూడు.

– కాళోజీ

మీకు తెలుసా..?

జెండాగద్దె లేని 'గంగిపల్లి'



మానకొండూర్: ప్రతీగ్రామంలో వివిధ రాజకీయ పార్టీల జెండాలు స్వాగతం పలుకుతుంటాయి. జెండాలు.. జెండా గద్దెల ఏర్పాటులో చిన్నపాటి యుద్ధాలే జరుగుతుంటాయి. అయితే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలో ఇప్పటివరకు ఒక్క రాజకీయ పార్టీ జెండా గద్దె లేకపోవడం విశేషం. గంగిపల్లి రాజకీయాలు తెలియని గ్రామం కాదు. గ్రామం నుంచి పేరున్న నేతలు పొలిటికల్‌గా రాణిస్తున్నారు. అయినా.. గ్రామ ప్రజల్లో ఉన్న ఐక్యత వీరి సామరస్యతకు చిహ్నంగా నిలుస్తోంది. మాజీ మంత్రులు ఎమ్మెస్సార్, చొక్కారావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు వంటి నేతలతో గ్రామస్తులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన కనకం నర్సయ్య నుస్తులాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఐదువేల జనాభా, రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. రాజకీయ పార్టీల జెండాగద్దెల నిర్మాణాలతో ఇబ్బందులు ఉంటాయని, కలిసిమెలసి ఉన్నవాళ్ల మధ్య జెండా గద్దెల చిచ్చువద్దనుకుని ఏళ్లక్రితం గ్రామపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని ఇప్పటికీ పాటిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు గంగిపల్లి గ్రామస్తులు.


ఇందిరమ్మకు జీవన్‌రెడ్డి నివాళి



జగిత్యాలటౌన్: ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా జీవన్‌రెడ్డి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వ్యక్తులు ముఖ్యం కాదని, వ్యవస్థ ముఖ్యమన్నారు.

విద్యావంతులను బరిలోదించిన బీఎస్పీ!

- ఉమ్మడి జిల్లాలో 10 మంది అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీ
- తమతోనే సామాజిక మార్పు అంటున్న అభ్యర్థులు





దాసరి ఉష, నిశాంత్ కార్తికేయగౌడ్, ఏ.నరేశ్ యాదవ్, పిట్టల భూమేశ్, గోలి మోహన్, పల్లె ప్రశాంత్‌గౌడ్, కొంకటి శేఖర్, నిషాని రాముచంద్రం, నక్క విజయ్‌కుమార్, బి.మల్లేశ్‌యాదవ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల సమరంలో ఏనుగు పార్టీ దూకుడు పెంచింది. ప్రధాన పార్టీలకు దీటుగా అభ్యర్థులను ఎంపిక చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కసరత్తు చేస్తోంది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 స్థానాలకుగాను రెండు విడతల్లో 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థుల ఎంపికలో ఉన్నత విద్యావంతులు, యువతకు పెద్దపీట వేసింది. జనం నాడి పట్టుకొని, రాజకీయాల్లో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు వీరంతా సిద్ధమవుతున్నారు. సామాజిక మార్పు తమతోనే అంటూ తమతమ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్, మంథని అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన వారిలో గౌడ్స్-2, యాదవ్-2, ముదిరాజ్-1, ఎస్సీ-3, మున్నూరుకాపు-1, పద్మశాలీ-1(మహిళకు) బీఎస్పీ సీట్లు కేటాయించింది.

ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం..

పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. దాసరి పద్మ హనుమయ్య ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామగుండం నుంచి బరిలో నిలిచిన అంబటి నరేశ్‌యాదవ్ సింగరేణి ఉద్యోగం వదిలిపెట్టి, ఆర్ఎఫ్‌సీఎల్ సహా సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ ఇటీవల బీఎస్పీలో చేరారు. వేములవాడ అభ్యర్థి గోలి మోహన్ అమెరికాలో శాస్త్రవేత్తగా పనిచేశారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, సేంద్రియ సాగు వైపు అన్నదాతలను ప్రోత్సహించేలా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల అభ్యర్థి మల్లేశ్‌యాదవ్ ఎంపీటీసీ సభ్యుడిగా, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. కోరుట్లలో కార్తికేయగౌడ్ తన తల్లి జెడ్పీటీసీగా పని చేయటంతో ఆమె బాటలోనే రాజకీయాల్లో ప్రవేశించారు. సిరిసిల్ల నుంచి పిట్టల భూమేశ్ రాష్ట్ర సర్పంచ్ ఫోరం సలహాదారుగా, పలు ప్రజాసమస్యలపై పోరాటాలతో గుర్తింపు పొందారు. ధర్మపురి అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ టీ-మాస్(తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక) జగిత్యాల చైర్మన్‌గా, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు.

బీఎస్పీ అభ్యర్థుల విద్యార్హతలు

దాసరి ఉష -పెద్దపల్లి
బీటెక్, ఐఐటీ, ఖరగ్‌పూర్
నిశాంత్ కార్తికేయగౌడ్- కోరుట్ల
బీసీఏ, ఎంఏలో ఫిల్మ్ మేకింగ్
అంబటి నరేశ్‌యాదవ్ -రామగుండం
పీజీలో రాజనీతిశాస్త్రం
పిట్టల భూమేశ్‌ముదిరాజ్- సిరిసిల్ల
ఎల్ఎల్‌బీ
గోలి మోహన్ -వేములవాడ
ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ
పల్లె ప్రశాంత్‌గౌడ్ -హుజూరాబాద్
- ఎంఏ ఎల్ఎల్‌బీ
కొంకటి శేఖర్ -చొప్పదండి
ఎంఎస్సీ బీఈడీ
నిషాని రామచంద్రం -మానకొండూర్
ఎల్ఎల్‌బీ
నక్క విజయ్‌కుమార్ -ధర్మపురి
ఏవియేషన్ డిప్లొమా
బల్కం మల్లేశ్‌యాదవ్ -జగిత్యాల- ఎస్ఎస్‌సీ

అభ్యర్థులకు అదనపు భద్రత

- గన్‌మెన్‌లకు పోలీస్‌శాఖ ఆదేశాలు
- నిరంతర నిఘా కోసం నియామకం

జగిత్యాలరూరల్: మెదక్ ఎంపీ, సిద్దిపేట జిల్లా దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం నేపథ్యంలో ఎన్నికల కమిషన్, పోలీసు శాఖ అప్రమత్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతోపాటు, మిగిలిన పార్టీల అభ్యర్థులకూ భద్రత కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసుశాఖ అదనంగా సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడుతోంది.

అభ్యర్థులకు గన్‌మెన్‌ల పెంపు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులకు గన్‌మెన్‌లను పెంచేందుకు పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఉన్న గన్‌మెన్‌లను మరింత పెంచనుంది. నిరంతరం నిఘా కొనసాగించాలని ప్రస్తుతం ఉన్న గన్‌మెన్‌లను ఆదేశించింది. అభ్యర్థి ఎటు వెళ్లినా వారివెంటే ఉండేలా చూడాలని పేర్కొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను నిర్లక్ష్యం చేయొద్దని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సమస్యాత్మక ప్రాంతాలకు వెళ్తే అదనపు భద్రత

ప్రధాన పార్టీల అభ్యర్థులు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు అదనపు భద్రతతోపాటు, పోలీసుల నిఘా పటిష్ఠంగా కొనసాగాలని పోలీసు శాఖ ఆదేశించింది. ముందుగానే అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో నిఘా పటిష్ఠం చేయాలని పేర్కొంది.



గన్‌మెన్‌లు

అదనపు భద్రత పెంచుతున్నాం



ప్రధాన పార్టీల అభ్యర్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనపు భద్రత ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థులు ప్రచార సమయంలో భద్రతపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రస్తుతం ఉన్న గన్‌మెన్‌లతోపాటు, అదనంగా గన్‌మెన్‌లను కేటాయిస్తున్నాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

శుభకార్యాలకు 'కోడ్' కష్టాలు

- ఎన్నికల వేళ.. తప్పని ఇబ్బందులు
- కల్యాణ మండపాలే ప్రచార వేదికలు
- ముహూర్తాలకు ఆటంకంగా నిబంధనలు
- తనిఖీలతో డబ్బు తరలించలేని దుస్థితి



గొల్లపల్లి(ధర్మపురి): ఓవైపు ఎన్నికల ప్రచారం.. మరోవైపు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మండపాలే ఎన్నికల ప్రచార వేదికలు కానున్నాయి. నవంబర్ నెలలో 16, 19, 21, 22, 23, 24, 26, 29 తేదీల్లో ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. ఈ తేదీల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 7 వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి సమయంలో ఎన్నికల నిబంధనల వల్ల ఇబ్బందికర పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. వివాహం అంగరంగ వైభవంగా జరిపించాలని అందరూ భావిస్తారు. ఇందుకు డబ్బులు, ముహూర్తాలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. మధ్యతరగతి కుటుంబాలు పెళ్లి చేయాలన్నా రూ.లక్షల్లో ఖర్చవుతోంది. ఇక ధనవంతులకు సంబంధించి అది రూ.కోట్ల వ్యవహారం. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ ఆటంకంగా మారింది. ఒక వ్యక్తి రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపాలని, లేదా సీజ్ చేయాలని ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది.

బంగారం, సామగ్రి కొనేదెలా?

పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. ఈ నెల 16 నుంచి డిసెంబర్ 6 వరకు ముహూర్తాలున్నాయి. ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో జిల్లా చుటూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన అధికారులు నిఘా పెంచారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తరలిస్తే వెంటనే సీజ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బంగారం, ఇతర పెళ్లి సామగ్రి కొనేదెలా అని పలువురు వాపోతున్నారు. ఇళ్ల ముందు, ఫంక్షన్ హాళ్లలో డెకరేషన్ చేయాలన్నా రూ.లక్షలతో కూడుకున్న వ్యవహారం. డబ్బులు నగదు రూపంలో చెల్లిస్తేనే పనులు జరుగుతాయి. ఫోన్ ద్వారా నగదు బదిలీ చేయాలంటే రోజుకు రూ.లక్ష వరకే వీలుంది. ఈ స్థితిలో ఏం చేయాలో తెలియడం లేదని వధూవరుల కుటుంబాలు అంటున్నాయి.

అభ్యర్థుల్లో అయోమయం

మరోవైపు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. నవంబర్ 30న పోలింగ్ ఉండటంతో ఓట్లు ఎలా సాధించుకోవాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితులు ఎక్కువ మంది పెళ్లిళ్ల హడావుడిలో ఉంటే తమకు ఓట్లు పడతాయో లేదోనని దిగులు చెందుతున్నారు.

మండపాల్లో ప్రచారానికి ప్రణాళికలు

పెళ్లి ముహూర్తాల సమయంలోనే ఎన్నికలు ఉండటంతో అభ్యర్థుల ప్రచారానికి మండపాలే వేదికలు కానున్నాయి. పెళ్లింటి నుంచి ఆహ్వానం అందితే చాలు అక్కడికి వెళ్లి, ప్రచారం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆడపెళ్లి వారికి ఎంతో కొంత కట్నకానుకలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో గ్రామాలవారీగా ఎవరి ఇంట్లో వివాహం జరగబోతోందనే వివరాలను గ్రామస్థాయి నాయకులతో తెప్పించుకుంటున్నారు.

గిరాకీ దెబ్బతింది



ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గిరాకీ పూర్తిగా దెబ్బతింది. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్కో స్వర్ణకారుడు రోజుకు 10 తులాల బంగారు ఆభరణాలు తయారు చేసేవారు. ప్రస్తుతం 20 రోజులుగా ఎలాంటి పని లేదు. డబ్బులు తీసుకొని రావాలంటే అధికారులు ఎక్కడ సీజ్ చేస్తారోనని ప్రజలు భయపడుతున్నారు. దీంతో ముహూర్తాలున్నా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

– సజ్జనపు అశోక్, స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు, గొల్లపల్లి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాలలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షకూర్, గంగారాజు, రాజశేఖర్, నందిని, గంగోత్రి, ధనుష్ నెట్‌బాల్, ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ అండర్–19 విభాగంలో కరీంనగర్ మండలం నగునూర్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపారని, ఈనెల 3న గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ అనూప్ రెడ్డి అభినందించారు.

రూ. లక్ష నగదు పట్టివేత


తనిఖీ చేస్తున్న పోలీసులు

కథలాపూర్: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి స్కూటీలో తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ మొత్తంలో డబ్బులు తరలిస్తుండటంతో పట్టుకున్నామన్నారు. పట్టుకున్న నగదును జిల్లా అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చింతకుంటలో మద్యం..

మండలంలోని చింతకుంటలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 51వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మద్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందజేత



పట్టా అందుకుంటున్న రమేశ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గర్షకుర్తి రమేశ్‌కు ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను ఉస్మానియా యూనివర్సిటీ విశ్వవిద్యాలయ అధికారులు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా రమేశ్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళ సైతోపాటు, అడోబ్ సీఈవో నారాయణ, వీసీ, తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


లక్ష్మణ్ మృతదేహం

జగిత్యాలక్రైం: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి వాగులో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పుట్ట లక్ష్మణ్ (26) మంగళవారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పుట్ట రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గల్లీ టు ఢిల్లీ

- పరిషత్ నుంచి పార్లమెంటు వరకు
- ఎంపీపీ, జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యేలుగా..
- కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చట్ట సభల్లోకి
- రాజకీయంగా రాణిస్తున్న ఉమ్మడి జిల్లా నేతలు


చాడ వెంకట్‌రెడ్డి, కటుకం మృత్యుంజయం, చింతకుంట విజయరమణారావు, బొడిగె శోభ, పొన్నం ప్రభాకర్, గంగుల కమలాకర్, బండి సంజయ్, కోరుకంటి చందర్

కరీంనగర్: తొలి అడుగు నుంచి వెనక్కి చూడకుండా.. గెలుపోటములకు భయపడకుండా ముందుకు సాగితేనే రాజకీయంలో విజయం వరిస్తుంది. గల్లీలో ప్రారంభమైన విజయం ఢిల్లీ వరకు తీసుకెళ్తుంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వివిధ పార్టీల నేతలు సర్పంచ్‌గా.. ఎంపీపీగా.. కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, నేడు అసెంబ్లీ, పార్లమెంటులో తమ గళాన్ని వినిపిస్తున్నారు. 1987లో జరిగిన మొదటి ఎంపీపీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు ఎంపీపీలుగా, జెడ్పీటీసీ సభ్యులుగా, కౌన్సిలర్, కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్‌లుగా తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నేతలు ఆ తర్వాత ప్రజల ఆశీస్సులతో చట్టసభల్లో అడుగుపెట్టారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకున్నవారిలో కొందరిపై కథనం.

అసెంబ్లీకి ఎన్నికైనవారు..

- సంజయ్ విచార్ మంచ్ నుంచి 1983లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన కటుకం మృత్యుంజయం మండల వ్యవస్థ ఏర్పడ్డాక ఓదెల జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన కేతిరి సాయిరెడ్డి 1989 శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు.
- కరీంనగర్ ఎంపీపీగా పని చేసిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు 1994లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- మంథని ఎంపీపీగా గెలిచిన చందుపట్ల రాంరెడ్డి 1994లో మంథని ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- సుల్తానాబాద్ ఎంపీపీగా గెలిచిన బిరుదు రాజమల్లు 1994లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ప్రత్యక్ష పద్ధతిలో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన సుద్దాల దేవయ్య 1994, 1999లో నేరెళ్ల ఎమ్మెల్యేగా, 2009లో చొప్పదండి ఎమ్మెల్యేగా కొనసాగారు.
- ధర్మారం జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన గుజ్జుల రామకృష్ణారెడ్డి 1999లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- మూడు సార్లు చిగురుమామిడి ఎంపీపీగా, ఒకసారి జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి 2004లో ఇందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై, సీపీఐ శాసనసభాపక్ష నేతగా పని చేశారు.
- మానకొండూరు జెడ్పీటీసీ సభ్యుడిగా, జెడ్పీ చైర్మన్‌గా కొనసాగిన ఆరెపల్లి మోహన్ 2009లో మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచిన బొడిగె శోభ 2014లో చొప్పదండి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన చింతకుంట విజయరమణారావు 2009లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం అందుకున్నారు.
- మంథని ఎంపీపీగా, జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన పుట్ట మధు 2014లో మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న కాశిపేట లింగయ్య 2004లో నేరెళ్ల ఎమ్మెల్యేగా గెలిచారు.
- సింగిల్‌విండో చైర్మన్‌గా పని చేసిన పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా 2009లో పార్లమెంటులో అడుగుపెట్టారు.

కార్పొరేటర్ స్థాయి నుంచి..

- కరీంనగర్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన కఠారి దేవేందర్‌రావు 1999లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం సాధించిన మంత్రి గంగుల కమలాకర్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పని చేశారు.
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కార్పొరేటర్‌గా పని చేశారు.
- రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన సోమారపు సత్యనారాయణ రామగుండం ఎమ్మెల్యేగా కొనసాగారు.
- వేములవాడ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన గొడిశాల రాజేశంగౌడ్ జెడ్పీ చైర్మన్‌గా, జగిత్యాల ఎమ్మెల్యేగా, ఎన్టీఆర్ కేబినెట్‌లో గృహ నిర్మాణశాఖ మంత్రిగా పని చేశారు.

సీఎం కేసీఆర్ మహామోసకారి


మాట్లాడుతున్న డాలీశర్మ, పక్కన మక్కాన్‌సింగ్

పెద్దపల్లిరూరల్: ‘తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ.. దీంతో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందనుకుంటే.. సీఎం కేసీఆర్ కుటుంబం వద్ద బందీ అయింది’ అని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ విమర్శించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి మాట్లాడారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయని మహామోసకారి సీఎం కేసీఆర్ అని దుయ్యబట్టారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించి, మహిళా బ్యాంకు ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ‘మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అమలు అంటే.. నీ కూతురు కవితకు పదవులు ఇవ్వడమేనా?’ అని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించి పేపర్ లీక్ చేసిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇక్కడ ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేతలు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. టీపీసీసీ కార్యదర్శి శ్యాం, అధికార ప్రతినిధి వెంకటరమణ, కౌన్సిలర్లు సంపత్, సుభాష్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హత్యా రాజకీయాలు మానుకోవాలి

- సీఎం సభకు 50 వేల మంది రాక
- మంత్రి కొప్పుల ఈశ్వర్


సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి: బీఆర్‌ఎస్ పార్టీ ప్రభంజనాన్ని ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులకు పాల్పడుతున్నారని, ఆ పార్టీ హత్యారాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మెదక్ ఎంపీ కొత్తపెల్లి ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండించారు. ప్రజాక్షేత్రంలో ప్రజలను ఒప్పించి ఓట్లు అడగాలి తప్ప దాడులు చేసే నీచ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. అలాంటివారికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజేశ్ ఉన్నారు.

సీఎం సభకు తరలిరండి

ధర్మపురికి ఈనెల రెండున (గురువారం) సీఎం కేసీఆర్ వస్తున్నారని, ఆయన సభను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. సభకు 50వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ స్థలం, హెలీప్యాడ్, వీఐపీ పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని నేరెళ్ల, గోవిందుపల్లె, తుమ్మేనాల, ఆకసాయిపల్లెల్లో ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయాలని కోరారు. మహిళలు, కార్యకర్తలు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలిస్తే మల్యాలలో 100 పడకల ఆసుపత్రి

- మేడిపల్లి సత్యంకు అవకాశం ఇవ్వండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మల్యాలలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యంతో కలిసి మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం చేశారు. అగంతపు రవళి, వంశీ, యువకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌కు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపెడతామని పేర్కొన్నారు. ముందుగా చిన్ననాటి మిత్రుడైన కరబూజ చిన్న మల్లయ్య, కొక్కుల నాగభూషణంను కలిశారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోచుకున్నారని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, వీరబత్తిని శోభారాణి, వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, షేర్ల పద్మ, మారంపెల్లి లక్ష్మణ్, ముత్యం శంకర్, వేల్మ వంశీకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుకు చిన్నారి విరాళం

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ జగిత్యాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డికి చల్‌గల్ గ్రామానికి చెందిన చిన్నారి శ్రీనిత్య తన కిడ్డీ బ్యాంక్‌లో జమచేసిన రూ.4,791ను ఎన్నికల ఖర్చు కోసం మంగళవారం అందించారు.

బీఆర్‌ఎస్ వస్తేనే 24 గంటల కరెంట్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్‌ది వసూళ్ల పార్టీ అని, 24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ కావాలా, ఐదు గంటలు ఇచ్చే కాంగ్రెస్ కావాలా అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దావ సురేశ్, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆసీఫ్, సర్పంచ్ ఏళ్ల గంగనర్సు, ఉపసర్పంచ్ పద్మ, నాయకులు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో యువకుల చేరిక

వెల్దుర్తి గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్నికలేవైనా గెలుపు బీఆర్‌ఎస్‌దే

ఎన్నికలేవైనా గెలుపు బీఆర్‌ఎస్‌దేనని, భారీ మెజార్టీతో సంజయ్‌ని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. మంగళవారం మండలాల బూత్‌కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకోవాలని, కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశంగౌడ్, పార్టీ మండల అధ్యక్షులు బాలముకుందం, సురేందర్‌రావు, రాజేంద్రప్రసాద్, లక్ష్మీ, దామోదర్ రావు, మహిపాల్‌రెడ్డి, తదితరుఉల పాల్గొన్నారు.

వడ్డెరులకు పూర్వ వైభవం కల్పిస్తాం

జగిత్యాల: వడ్డెరులకు పూర్వ వైభవం కల్పిస్తామని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎల్‌ఎన్ గార్డెన్స్‌లో వడ్డెరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వడ్డెర భవనానికి స్థలం కేటాయించామని, భవన నిర్మాణ బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వడ్డెరులకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశంగౌడ్ పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

మరోసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపెడతానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 19వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోసారి అవకాశం కల్పిస్తే జగిత్యాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిధులు దారి మళ్లిస్తున్నారు


రాయికల్ : పార్టీలో చేరిన వారితో భోగ శ్రావణి

జగిత్యాలరూరల్: కేంద్ర నిధులు దారి మళ్లించి బదనాం చేసేందుకు బీఆర్‌ఎస్ కుట్ర చేస్తోందని జగిత్యాల బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపల్లిలో ప్రజాగోస బీజేపీ భరోసా పేరుతో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా నీరు సరిగా రావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను దారి మళ్లించి ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీనివాస్, దశరథ రెడ్డి, నర్సింహారెడ్డి, రాజేశ్వరి, కొక్కు గణేశ్, వెంకట్ రెడ్డి, వెంకటేశ్, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలి

సారంగాపూర్: బీజేపీ గెలుపునకు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. పోతారం గ్రామానికి చెందిన 50 మంది బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు బద్దెల గంగరాజం, వంశీ, భీమయ్య, వేణు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటలు నమ్మొద్దు

రాయికల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో సుమారు 50 మంది శ్రావణి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు జితేందర్, ఉపసర్పంచ్ రవీందర్, మాజీ ఎంపీటీసీ గంగాధర్, బూత్ అధ్యక్షుడు ధర్మరాజు, నాయకులు తిరుపతి, మహేశ్, పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



జగిత్యాల: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ, పదో తేదీ వరకు గడువు ఉంటుందని, 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్‌లు అందిస్తారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 95 కేసులు నమోదు చేసి రూ.1,09,55,920 సీజ్ చేశామని తెలిపారు.

పీవో, ఏపీవోల పాత్ర కీలకం

ఎన్నికల్లో పీవో, ఏపీవోల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో అధికారులకు ఇస్తున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం అనుమానాలకు తావు లేకుండా పకడ్బందీగా పనిచేయాలన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కలిసిరండి

- దళితబంధు కాదు అది బీఆర్‌ఎస్ బంధు
- కాంగ్రెస్ కోరుట్ల అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు


ఇబ్రహీంపట్నం: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని కాంగ్రెస్ కోరుట్ల అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలకేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు లేవని, నోటిఫికేషన్లన్నీ లీక్ అవుతున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలతోపాటు ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీలు, పార్టీ మహిళా నాయకురాలు నర్సక్క, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఉన్నారు. అంతకుముందు ఎర్దండి, కొజన్‌కొత్తూర్, కేశాపూర్, అమ్మక్కపేట, తిమ్మాపూర్, గొధూర్ గ్రామాల నుంచి సుమారు 400 మంది పార్టీలో చేరారు. సమావేశం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకూ కరెంట్ రాలేదు. దీంతో కావాలనే విద్యుత్ నిలిపివేశారని కార్యకర్తలు ఆరోపించారు.

జగ్గసాగర్‌లో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో జువ్వాడి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, ప్రవీణ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

మెట్‌పల్లి: పట్టణంలోని వివిధ పార్టీల నుంచి సుమారు 200మంది జువ్వాడి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులున్నారు.

ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోరుట్ల రూరల్: ఐదుగురి గుప్పిట్లోనే తెలంగాణ బందీ అయిందని కోరుట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు ఆరోపించారు. పట్టణంలోని కావేరి గార్డెన్స్‌లో మండలకాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతీ పనిలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కమీషన్లు తీసుకుంటున్నారన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధగౌడ్, రాజం, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కిసాన్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్పందన



జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల అండర్–14, 17 బాలుర అథ్లెటిక్స్ పోటీలకు స్పందన లభించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. అండర్–14 వందమీటర్ల పోటీలో ధర్మపురి నుంచి అర్జున్ ప్రథమ, జగిత్యాల అర్బన్ మండలానికి చెందిన నర్సింహ ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్లలో పెగడపెల్లి ప్రథమ, కోరుట్ల ద్వితీయ, 400 మీటర్ల విభాగంలో కోరుట్ల ప్రథమ, బుగ్గారం ద్వితీయ, 600మీటర్ల విభాగంలో పెగడపల్లి ప్రథమ, బుగ్గారం ద్వితీయ, షాట్‌పుట్‌లో మెట్‌పల్లి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డిస్కస్‌త్రోలో మెట్‌పల్లి, కథలాపూర్ విద్యార్థులు రాణించారు. పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, పీఈటీలు పడాల కృష్ణప్రసాద్, అజయ్, అజయ్‌బాబు, సాగర్, భాస్కర్, వెంకటలక్ష్మి, జమునారాణి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తే చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఒడ్డెలింగాపూర్‌కు చెందిన బోదాసు సతీశ్, జగిత్యాల పట్టణానికి చెందిన బెక్కం రేవంత్‌ను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. వీరిద్దరు ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తుండగా ఎస్సై అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరినుంచి రూ.39వేల విలువ గల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి, వారిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై అజయ్‌కుమార్, కానిస్టేబుల్ ప్రశాంత్, అశోక్, రామకృష్ణను సీఐ అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కి చెందిన పిల్లి మల్లేశం (58) మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేశం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. ఈ క్రమంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు,. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనిఖీలు

మల్లాపూర్: జిల్లా సరిహద్దు ఒబులాపూర్‌లో బాదనకుర్తి వంతెన సమీపంలోని చెక్‌పోస్టు వద్ద సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.50 లక్షలను అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆ మొత్తాన్ని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గిరుకల కాలనీకి చెందిన గుర్రాల పోశన్న (40) మంగళవారం ద్విచక్రవాహనంపై తన పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పోశన్నకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఇంటింటా మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ధర్మపురి: వాతావరణ మార్పులతో వస్తున్న విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. పట్టణానికి చెందిన ఓ చిన్నారి విషజ్వరంతో సోమవారం మృతి చెందిన విషయం తెల్సిందే. దీంతో శ్రీనివాస్ పట్టణానికి చేరుకున్నారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. గిరుకల కాలనీ, పాత పోస్టాఫీస్ రూట్‌లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ డ్రమ్ములు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జ్వరబాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. డెంగీ లక్షణాలు లేవని, విషజ్వరాలు మాత్రమేనని పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.